
PRAMUKHANDHRA
22nd Year of Publication
We carry the news and views of Telugus
ప్రముఖాంధ్ర
₹15
సంపాదకుడు
గోటేటి శ్రీ రామారావు
మే 2016
THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA,
GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే




256 నెలలుగా
256 సంచికలను

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల టేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు


చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

మే 2016

సంపుటి : 22 **257** సంచిక : 5




## ఆధ్యాత్మికత అంటే ముక్కు మూసుకుని ఆరాధించడం కాదు! శారీరక, మానసిక ప్రకాశం, సకుటుంబ, సబంధుమిత్ర సహజీవనం

ఆధ్యాత్మికతను ఏదో మడిగట్టుకున్న పదంగా భావిస్తాం. అదేవీ ముక్కుమూసుకుని ధ్యానంలో లీనమవడం కాదు జపతపాలూ నియమ నిష్ఠ పాలనం అసలేకాదు!

ఆధ్యాత్మికత అంటే అదొక జీవనశైలి. అంతర్లీనంగా కలిగే పరిశుద్ధ ప్రశాంతత. ఓ గురు ఆశ్రమంలోనో, ఓ వృద్ధాశ్రమంలోనో దొరికే వస్తువు కాదు. క్రయవిక్రయాలకు అతీతమైనది. ఎక్కడో వనాలందు లభించదు. ఏకాంతమున అసలే లభించదు. బాహ్యాంతర శుచిత్వము లందసలే లేదు.

కుటుంబమే ఆధ్యాత్మిక సౌధం. మానసిక వికాసమే ఆధ్యాత్మికత. కుటుంబంలోని వారే ఇష్టార్థసిద్ధి ప్రదాతలు. తల్లితండ్రులే ప్రత్యక్ష దైవాలు. వారిని పూజించడంలోనే పార్వతీ పరమేశ్వరులు సంతృప్తి చెందుతారు.

తొలి గురువు తల్లి. కనులు విప్పీ విప్పకుండా ఉన్న బిడ్డను చూచి తొలిగా ఆనందించేది ఆమే! తల్లే తొలి గురువు. సభ్యత, సంస్కారం సంప్రదాయం, అలవాట్లు, సాధనా బలం, ఆహారాదులను ఆమె నుంచే గ్రహిస్తాడు. ఉగ్గుపాలను తల్లే రంగరించి పోస్తుంది. బోసినవ్వును చూచి మురిసిపోతుంది. బోర్లాపడడం చూచి అరిసిపోతుంది. ఆమె మురియబాటులోనే అంతులేని ఆత్మీయత దాగి ఉంటుంది. ఆ ఆత్మీయతలో అంతరంతరంగా ఆధ్యాత్మికత ఉంటుంది. తల్లీబిడ్డల పరస్పరాత్మీయతల్లో అంతరంగాలను స్పృశింపచేస్తున్న పవిత్రతనందు ఆధ్యాత్మికత దాగి ఉంది. పవిత్రాత్మలోని ఆత్మీయతే ఆధ్యాత్మికత. దైవంపైన భక్తుడు చూపించినట్లుగానే ప్రేమాస్పదులైన తల్లితండ్రుల పట్ల బిడ్డ చూపించేదే ఆధ్యాత్మికత. తండ్రి వేలు పట్టి నడిపిస్తాడు. వాడికి నడకనేర్పుతాడు. సుఖమయమయ్యే దారి చూపుతాడు!

తండ్రిలో ఉండే తపనను తపస్సు అనే చెప్పాలి. తన బిడ్డకు ఉన్నతస్థితి కలిగించాలనే పెంపుదల ఆయనలో ఉంటుంది. బిడ్డకు పంచే ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమ బిడ్డలో అచంచల విశ్వాసం కలిగిస్తుంది. తండ్రి చూపించు మార్గము, బోధించు వాక్యము గీతా వాక్యం. గీతా బోధ వంటిది. సద్గురువులను మించిన సద్గురువు తండ్రి. ఉపదేశికుడు. ఉపాధి మార్గదర్శకుడు. ఆయన ఆది గురువు. సద్గురువులను మించిన గురువు.

ఇహ అన్నదమ్ములదీ ఆధ్యాత్మిక బంధమే. తమ్ముడి కాలిలో ముల్లు గుచ్చుకుంటే అన్న మనస్సు కలుక్కుమంటుంది. అన్న కంట్లో నలుసుపడితే– అది బయటకు వచ్చేవరకూ తమ్ముడు కుమిలిపోతాడు. వారి శరీరాలు వేరు; కాని ఆత్మ ఒక్కటే. శ్రీరామచంద్రుడు తమ్ముల్ని చూసినా, ధర్మరాజు తమ్ముళ్లను చూచినా, బలరామకృష్ణులను చూచినా ఈ గొప్ప అనుబంధం కనిపిస్తుంది. ఇది భారతీయుల్లో గల ఆధ్యాత్మిక అనుబంధం. అలవికాని ఆత్మ సౌరభం.

తండ్రి తరువాత స్థానం అన్నకే ఉంది. తల్లి తరువాత స్థానం వొదినకే ఉంది. రామలక్ష్మణుల ఆధ్యాత్మిక అనుబంధం లోకానికే ఆదర్శం– బలరామకృష్ణుల అనుబంధం ఆధ్యాత్మిక అనుబంధం.

పూరీలో జరిగే జగన్నాధ రథయాత్రలో బలరామకృష్ణులతో బాటు సోదరి సుభద్రకూ అంతే స్థాయిలో రథయాత్ర జరుగుతుంది. ఇది సోదర సోదరీ అనుబంధ ఆధ్యాత్మిక యాత్రగా జగద్విదితమైంది.

భారతీయుల ప్రతీ గృహంలోనూ ఆధ్యాత్మికత మిళితమైన పండుగలే జరుగుతూంటాయ్. సమష్టి కుటుంబాలలో జరిగే ధార్మిక కార్యాలన్నీ ఆధ్యాత్మికపరంగానే జరుగుతాయ్. సమైక్యత, సమభావం. సౌమనస్యం అనేవి ఆధ్యాత్మిక కొమ్మకు చిగురించే చివురులు. ఆ చివురులను చింపేస్తే ఆధ్యాత్మికత నేలరాలిపోతుంది.

మానసిక ప్రశాంతత మనోస్థైర్యమూ దూరమవుతాయ్. మనములో ఆధ్యాత్మికత నెలకొన్ననాడు ప్రతీరోజూ, ప్రతీ రాత్రీ వసంత రాత్రే! ఆధ్యాత్మికతకు దూరం గాకుండా ఉండడానికే ప్రయత్నించడం ఫలదాయకం!



బుధజన విధేయుడు

**– గోటేటి శ్రీరామారావు**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# వైశాఖ శుద్ధ తృతీయ! అక్షయ తృతీయ! అందరి కళ్లు బంగారం పైనే ఉంటాయ్!

## ఆ రోజు బంగారం కొంటే యిల్లంతా బంగారమవుతుంది. ఆ సంవత్సర భవిష్యత్తు సకల సంపత్కరంగా సాగిపోతుంది.

అక్షయ తృతీయ రోజు బంగారం కొంటే అది అక్షయం అవుతుందని భారతీయుల నమ్మకం. హిందూ పంచాంగం ప్రకారం అక్షయ తృతీయ అత్యంత శుభకరమైన రోజు. ఈ పర్వదినమున బంగారం కొంటే ఎంతో అదృష్టం కలిసి వస్తుంది. 2016 సం॥ము మే నెల 9వ తేదీన ఉరుకుపరుగులతో అక్షయ తృతీయ వస్తూంది. ఆ రోజున సముద్రరాజతనయ శ్రీరంగధామేశ్వరీ, శ్రీమహాలక్ష్మీ అమ్మవారు బంగారంతో అడుగుపెడతారు. ఆ రోజున బంగారం కొని పూజచేసినట్లయిన ఆ యింటి బంగారం అక్షయం అవుతుందని భారతీయుల విశ్వాసం.

వైశాఖ శుద్ధ తృతీయ నాడు కృతయుగం ప్రారంభమైందని పురాణాలు చెబుతున్నాయ్. మహావిష్ణువు ఆరవ అవతారమైన పరశురాముడు అవతరించాడంటారు. అంతేకాదు నరసింహస్వామివారు ప్రహ్లాదుణ్ణి అనుగ్రహించిన శుభదినం. ఈ పర్వదినమున భగవంతునికి ఫలం పుష్పము సమర్పించిననూ పుణ్యము కలుగుతుందని చెప్పబడింది. అక్షయ తృతీయనాడు హోమం కానీ, వ్రతం కానీ, ఎటువంటి పుణ్య కార్యం చేసినప్పటికినీ మంచి ఫలం ఉంటుంది. బంగారం కొంటే – ఆ యింట బంగారం అక్షయంగా నిలుస్తుంది.

బంగారం చాలా మెత్తని లోహం. ఒక ఔన్సు బంగారంతో 80 కిలోమీటర్ల తీగను తయారు చేయవచ్చు. పేదలు మొదలుకొని రాజవంశీకులకు సహితమూ బంగారం అంటేనే మోజు! బంగారం నిల్వలెక్కుగా సముద్రంలోనే ఉన్నాయంటారు. శ్రీమహాలక్ష్మిని లక్ష్మీ! సముద్రరాజతనయా! అని కొలుస్తారు. పెండ్లి మంగళసూత్రాలను బంగారంతోనే చేయడం ఆనవాయితీ. ●

# సీతారాముల కమనీయ ఘట్టాలు... ఎన్నో చెప్పుకోవచ్చు!

అన్యోన్యత ఆదర్శ దాంపత్యం అనగానే సీతారామచంద్రుల్నే ప్రధానంగా చెప్పాలి!ః ఒకరిపై నొకరికి అపారమైన ప్రేమ ఉన్న ఆదర్శదంపతులు!

సీతారాముల కమనీయ ఘట్టాలనెన్నో చెప్పుకోవచ్చు. మైలవరపు శ్రీనివాసరావు గారు ముచ్చటించిన ముగ్ధమోహన సన్నివేశాలను ఇందు పొందుపరుస్తున్నాం.

సీతమ్మ యదార్థానికి శ్రీహరి భార్య అయిన లక్ష్మీదేవే కదా! లక్ష్మి అనగానే సర్వాభరణాలూ, పట్టు వస్త్రాలూ, సర్వ రాజలాంఛనాలూ.. అన్నీ... మన మనసులో మెదుల్తాయి! అలాంటి లక్ష్మీస్వరూపమైన తాను రాముడు ఆజ్ఞాపించగానే నారచీరలను ధరించడానికి సిద్ధపడింది.

**రాముని కోసం సీతమ్మ ఏం చేసిదంటే..**

లోక కంటకుడైన రావణుణ్ని వధించడానికే శ్రీహరి రామునిగా అవతరించబోతున్నాడని గ్రహించింది లక్ష్మీదేవి, తన భర్త ఏ యుగంలో ఏ అవతారాన్నెత్తినా భార్యగా తాను అతనికి సహకరించాలని భావించింది. తన భర్త తలపడాల్సిన రావణుని తమశ్శక్తి స్థాయిని పరిశీలించింది. చెప్పలేనంత ఎత్తులో రావణుడున్నాడని అర్థమైంది. అతని తపశ్శక్తిస్థాయిని తగ్గించడం కోసమే తాను చావు శాపాన్ని (చంపించేందుకే పుడతాను సుమా!) ఇచ్చి రావణుడిని తక్కువ తపశ్శక్తి కలవాడిని చేసింది. భర్త చేయబోయే పనికి సహకరించడమంటే ఇదే కదా మరి!

**సీతమ్మ కోసం రాముడు ఏం చేశాడంటే...**

రావణవధ కోసం ప్రణాళికను సిద్ధం చేసుకున్న శ్రీహరి, బ్రహ్మను పిలిచి, అప్సరకాంతలు గంధర్వస్త్రీల గర్భాలలో– దేవతలందర్నీ పుట్టించవలసిందని ఆజ్ఞాపించాడు. తన భార్య లక్ష్మిని– జనకుని ఇంట జన్మించమని ఆజ్ఞాపించాడు. ఏ జనకుని ఇంటి దేవరాతునిచే బహూకరించబడిన శివధనుస్సుందో, ఆ ధనుస్సుకి నిత్యం పూజచేసే అవకాశాన్ని సీతమ్మ (లక్ష్మి)కి కల్పించాడు రాముడు (శ్రీహరి). అంతటి పూజచేసిన కారణంగానే శివతపశ్శక్తి సంపన్నుడైన రావణుడిని సీతమ్మ భస్మం చేయగలనని హెచ్చరించగలిగింది. సంవత్సరకాలం ఉండి కూడ రావణుడిని దరికి రానీయకుండా చేసుకోగలిగింది. సీతమ్మకి ఆ శక్తిని ఇచ్చినవాడు రాముడు.

**రామునికోసం సీతమ్మ ఏంచేసిదంటే...**

రాముడు దూతగా పంపగా ఆంజనేయుడు సీతమ్మ వద్దకు వచ్చాడు. పరీక్షలన్నీ ముగిశాక 'ఆంజనేయుడు రామదూతే' అనే నిర్ణయానికి వచ్చింది సీత. సీతమ్మలేని రాముడి పరిస్థితిని ఆంజనేయుని ద్వారా విని చలించిపోయింది. రాముడి ఉంగరాన్ని తీసుకుని, రామునికిమ్మని చూడామణి ఇచ్చింది. దీంట్లోనే ఉంది రహస్యం..

రామునికి సీతమ్మ ఎప్పుడూ పాదాభివందనం చేస్తూ ఉండేది. అలా నమస్కరించి ఆమె లేచి నిలబడేవేళ ముందుగా ఆమె తల మీద ఉండే చూడామణీ, ఆ తర్వాత ఆమె ముఖం రామునికి కనిపించేవి. దాంతో ఆయన చెప్పలేని ఆనందాన్ని పొందేవాడు. ఇప్పుడామె చూడామణిని రామునికి పంపిస్తూ 'నాథా! ఏ చూడామణి దర్శనం పిమ్మట నా ముఖం మీకు కనిపించేదో, అలా ఈ చూడామణిని చూస్తున్న మీకు నా ముఖం (నేను) తొందర్లో కనిపించబోతోంది" అని ఓదారుస్తోందన్నమాట. కష్టంలో ఉన్న భర్తను ఓదార్చడమనేది నిజమైన భార్య చేసేపని.

**సీతమ్మ కోసం రాముడు ఏం చేశాడంటే...**

తన అంగుళీయకాన్ని హనుమ చేతిలో ఉంచి, సీతమ్మకు ఇయ్యమన్నాడు రాముడు. ఆ ఉంగరాన్ని మనందరి వేలికీ ఉండే ఆభరణంగా భావించకూడదు. రాముని ఉంగరం వివాహకాలంలో ఈయబడినది. పైగా రాజముద్రిక అది. ఆ ముద్రికను ఏ రాజపత్రం మీద ముద్రగా వేసినా అది రాజశాసనమౌతుంది. ఏ పరిస్థితుల్లోనూ తీసివేయకూడనిది రాజముద్రిక. అలాగే వివాహకాలంలో పెట్టబడిన నిశ్చితార్థపు అంగుళీయకం కూడా. అయినా రాముడామెకు ఈ ఉంగరాన్ని పంపాడంటే 'సీతా! నీ కంటే ఈ రాజధర్మం, భర్తృస్థానం కూడా తక్కువే' అని చెప్పడమే.

**రాముని కోసం సీతమ్మ ఏం చేసిందంటే...**

సీతమ్మ యథార్థానికి శ్రీహరి భార్య అయిన లక్ష్మీదేవే కదా! లక్ష్మి అనగానే సర్వాభరణాలూ, పట్టువస్త్రాలూ, సర్వరాజలాంఛనాలూ.. అన్నీ మనసులో



మెదుల్తాయి! వివాహంలో నవవధువుకి సర్వాభరణాలూ, నూతనవస్త్రాలూ పెట్టి 'మహాలక్ష్మీస్వరూపిణి' అంటారు. అలాంటి లక్ష్మీస్వరూపమైన తాను రాముడు ఆజ్ఞాపించగానే నారచీరలను ధరించడానికి సిద్ధపడింది. ఆమె పుట్టుకతోనే ఐశ్వర్యవతి అయినా కూడా రామునికోసం ఆభరణాల్లేకుండా ఉండదలిచిందంటే అంతకంటే గొప్పదనం ఏముంటుంది.

**సీతమ్మ కోసం రాముడు ఏం చేశాడంటే...**

ప్రజా సంక్షేమం కోసం రాముడు అనేక యజ్ఞాలను చేయవలసి ఉంటుంది. తనకి రాజ్యాధికారం లేకపోవచ్చు. తాను అయోధ్యలో ఉండకపోవచ్చు. కాని, తానూ, తన తమ్ముడైన భరతుడూ చేసుకున్న ఒప్పందం ప్రకారం.. అయోధ్యకి రాజు భరతుడు. వనభూములకి రాజు తాను. ఆ కారణంగా రామునికి ప్రతియజ్ఞంలోనూ ధర్మపత్ని అవసరం ఏర్పడింది. మరెవరినీ కలలో కూడా భార్యగా ఊహించకపోవడమే కాకుండా, ప్రతి యజ్ఞంలోనూ సీతా స్వర్ణ ప్రతిమ (బంగారు సీతమ్మబొమ్మ)ను పెట్టి యాగాన్ని ముగించాడు రాముడు. ఇంతకంటే గొప్పదనమేముంటుంది? ●

---

నాగయ్యగారు తీయాలనుకున్న కుమ్మరిమొల్ల చిత్రాన్ని ఎల్వీ ప్రసాద్‌గారు తీయాలని కథకుడు ఇంటూరి వెంకటేశ్వరరావు వద్ద హక్కులను వ్రాయించుకున్నారు. కానీ ఎప్పటికీ ప్రసాద్‌గారు ఆ చిత్రాన్ని తీయలేదు. గ్రహించిన హక్కులను తిరిగి యివ్వడం లేదు.



నాగయ్య

'కుమ్మరిమొల్ల'పై వెంకటేశ్వరరావుగారు గంపెడాశలు పెట్టుకున్నారు. నాటకంగా వ్రాయించి, వారి కుమార్తెను మొల్లగా నటింపచేసి తృప్తి పడ్డారేగానీ, ఆ చిత్రాన్ని తెరపై చూడాలనెడి కోరిక ఇంటూరిలో ప్రగాఢంగా మిగిలి ఉన్నది. నటుడు పద్మనాభం ఈ చిత్రాన్ని నిర్మించాలని భావించారు. రేఖా అండు మురళి బేనర్‌పైనే 'కుమ్మరిమొల్ల'కు తెరభాగ్యం కలుగ చేసారు. వాణిశ్రీ మొల్లపాత్రకు ప్రాణం పోసింది. చిత్రం విడుదలై 100 రోజులు విజయవంతంగా ప్రదర్శింపబడింది. ప్రభుత్వ అవార్డు లభించింది.



జానపద చిత్ర బ్రహ్మ సి. పుల్లయ్య

# పండిట్ పి.వి. నరసింహారావు- యని సంబోధించాలి!

కాంగ్రెసు దిక్కులు తెలియని దీనావస్థలో ఉన్నప్పుడు- తన చాణుక్య చతురతతో ఐదు సంవత్సరాలు భారత ప్రధానిగా భారత ఆర్థిక రంగాన్ని తీర్చిదిద్దినవాడు పి.వి. నరసింహారావు. ఆయన పద్నాల్గు భాషల్లో పండితుడు. ఆయన యెక్కడా పండిట్ మకుటాన్ని తగిలించుకోనూ లేదు; ఆయన అనుచరులు అననూ లేదు.

ఆయన ప్రధాని పదవిని చేబట్టడానికి కాంగ్రెసు అధిష్టానంలో అననుకూలురే యెక్కువ. రాజీవ్‌గాంధీ మరణించిన తరువాత విధిలేని పరిస్థితుల్లో పి.వి. నరసింహారావును ప్రధాన మంత్రిగా సమర్థించవలసి వచ్చింది. అప్పటికే పూర్వ ప్రధానులు భారత ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారు. దేశ బంగారాన్ని తాకట్టు పెట్టారు.



అట్టి పరిస్థితుల్లో ఓ సామాన్య ఉద్యోగిగా ఉన్న మన్‌మోహన్ సింగ్‌ను ఆర్థిక శాఖా మంత్రిగా తయారు చేసి, ఆ పదవిలో కూర్చో పెట్టినది పి.వి. నరసింహారావే!

పి.వి. నరసింహారావు మన్మోహన్ సింగ్‌కు ఆర్థిక శాఖ మెలకువలన్నీ చెప్పారు. దగ్గరుండీ సలహాలనిస్తూ, సంక్లిష్టంగా ఉన్న దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దింప చేసింది పి.వి. నరసింహారావే. ఈ మాటలు నావికావు! ఓహియో రాష్ట్రంలో జరిగిన తెలుగు మహాసభల్లో ఉండగా ఓ ప్రఖ్యాత అమెరికా నాయకుడు నరసింహారావును ప్రశంసిస్తూ అన్న సత్యవాక్కులు. నరసింహారావు ప్రోత్సాహంతో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షపీఠాన్ని అలంకరించిన సీతారాం కేసరి ప్రభృతులు సోనియాగాంధీకి వంతపాడి పి.వి. నరసింహారావుకు సకల బాధలు కలిగించారు. ప్రధాని అయిన తరువాత నరసింహారావు తమకు సలాములు కొట్టలేదనే ఉలుకుకూడ ఉంది. ప్రధాని పదవి విరమణానన్తరమ్ పి.వి.ని కోర్టు కేసులు కొన్ని మానసిక వేదనకు గురిచేసాయ్. పార్టీ సహకరించలేదు. ఎంతో నిబ్బరంగా ఉండే పి.వి.ని అనారోగ్యం పీడిస్తూ వచ్చింది. ఆరోగ్యం పూర్తిగా విషమించి ఢిల్లీలో చనిపోయిన పి.వి.ని అక్కడ దహన సంస్కారాలు జరుపకుండా పార్థివ శరీరం హైదరాబాదు పంపేట్టు చేసారు.

దేశప్రధానులందరికీ అంత్య మర్యాదల్ని చేసిన ఢిల్లీలో పి.వి.కి స్థానం లేకుండా చేసారు. హైదరాబాద్‌లోనే అంతిమ సంస్కారం జరుపవలసిన దుస్థితి పి.వి.కే పట్టింది.

మన్‌మోహన్‌ను తనంతవాడిగా రూపులు దిద్దిన పి.వి. నరసింహారావుకు దక్కిన గౌరవం. కోట్ల విజయభాస్కరరెడ్డి పి.వి. పట్ల అచంచలమైన భక్తి విశ్వాసములు కలవాడు. రాయలసీమ నుంచి లోక్‌సభకు పి.వి.కి ఘనవిజయం చేకూర్చాడు. అలాంటి పి.విని మరచిని కాంగ్రెసును ప్రజలు మరువడంలో వింతేముంది! బహుభాషల పండితునిగా ఆయనగాక మరెవరు పండిట్! చతురంగశాలిగా పి.వి. తక్క అన్యులు లేరు! ●

# రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేష్‌కుమార్



నిమ్మగడ్డ అనగానే నెమ్మదితనానికి గడ్డగా గలవారని ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం కమిషనర్‌గా నియమింపబడిన తొలిరోజుల్లోనే తెలిసింది. విజయరాఘవాచారి (టి.నగర్) రోడ్డులోని వారి మాతామహుల (అనే జ్ఞాపకం) యింటిలో కలిసినప్పుడా నిర్మల(త్వ)మైన ప్రేమమూర్తిని చూసాను. ఆయనలో ఒక ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ అనే గర్వం కనిపించలేదు.

అది తొలి ప్రేమలాటి వాత్సల్యం, గౌరవం, నిరాడంబరత్వం. సహజంగా కనిపించే చెరగని నవ్వు. ఆయన తిరుమల తిరుపతి దేవస్థానముల కమిషనర్‌గా ఉన్న 18 మాసాల్లోనూ మూడు నాలుగు పర్యాయములు కలిసి ఉంటాను.

తరువాత ఆయన సేల్సుటాక్సు కమిషనర్‌గా బదిలీ అయినారని తెలిసి, హైదరాబాద్ వెళ్లి కలిసాను. తనతో ఒక రోజు తిరిగే అవకాశం కల్పించడమే గాకుండా, హైదరాబాద్‌లో ఉన్న రెండోరోజు పర్యటించడానికి ఒక కారును కూడా యేర్పాటు చేశారు. ఫోను చేసిన సమయంలో ఆయన లేకుంటే – తిరిగి ఆయన కార్యాలయానికి వచ్చినపుడు గుర్తు పెట్టుకుని ఫోను చేసేవారు.

ఆయన రాష్ట్రగవర్నర్ కార్యాలయంలో చీఫ్ సెక్రటరీగా ఉన్నప్పుడు కలిసే అవకాశం కలుగలేదు. కానీ ప్రేమా, గౌరవమూ అలాగే కొనసాగింది. పరిచయ స్నేహానికింత ప్రాచుర్యంగా ప్రేమను ఒలికింపచేసేవారిని మరొకర్ని చూడలేదు. సమాచార శాఖా మంత్రిగా ఉన్న అక్కిరాజు వాసుదేవరావు, సమాచార శాఖ కమిషనర్‌గా పనిచేసిన బోయి భీమన్న, ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన కందామోహను తరువాత కొల్లలుగా ప్రేమ, గౌరవాలను కురిపించిన నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమితులు కావడం అస్మదీయులనెంతగానో ఆనందకందితుల్ని కావించింది. భగవంతుడీ మంచి మనిషికి ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఉన్నత పదవులను అధిష్టింపచేస్తూ, ప్రజలకు సేవచేసే అదృష్టాన్ని, ఆరోగ్యాన్ని కలిగించాలని ఏడు కొండల తేడును ప్రార్థిస్తున్నాను. ●

# లక్ష్మీరాజ్యం చిత్రాల్లో లక్ష్మీసరస్వతి ప్రసన్న చిత్రం 'నర్తనశాల'



'అపవాదు (1941), 'పంతులమ్మ' (1943) చిత్రాలతో కథానాయికగా మంచి పేరు సంపాదించుకున్న లక్ష్మీరాజ్యం 1941లో ఆమె రెవిన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌రావును వివాహం చేసుకుంది. వారిరువురు 1951లో రాజ్యం పిక్చర్స్ సంస్థను ప్రారంభించి తొలియత్నంగా 'దాసి' (1952) చిత్రాన్ని నిర్మించారు. తరువాత 'హరిశ్చంద్ర' (1956), 'శ్రీకృష్ణలీలలు' (1959) చిత్రాల్ని తీసి మంచి పేరు తెచ్చుకున్న ఈ జంట, నర్తనశాలకు ముందు 'ద్రౌపది' పేరుతో సినిమా తీయాలనుకున్నారు. అయితే సినిమా నిడివి బాగా పెరిగిపోతుందనే భావనతో కేవలం విరాటపర్వం కథకే పరిమితమై 'నర్తనశాల'కు శ్రీకారం చుట్టారు. సముద్రాల రాఘవాచార్యగారి ప్రతిభ ఆమెకు బాగా తెలుసు. సినిమాకు రచన చేయాల్సిన బాధ్యతను లక్ష్మీరాజ్యం సముద్రాలకు అప్పగించారు.

సముద్రాల సంస్కృతాంధ్ర భాషల్లో అందెవేసిన చేయి. పౌరాణిక చిత్రాలలో వాడుకభాషను ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే! 'భక్తపోతన' (1942), 'త్యాగయ్య' (1946) వంటి చిత్రాలు ఆయన రచనా రమణీయకతకు చిహ్నాలు. తిక్కన విరచించిన విరాటపర్వ గాథకు స్వల్పమైన మార్పులు చేర్పులతో సముద్రాల అద్భుతమైన స్క్రీన్‌ప్లేను సమకూర్చారు. అంతేకాక సంభాషణలు, కొన్ని పాటలు పద్యాలను ఆయనే రాసారు. తిక్కన రాసిన మూలకథకు సముద్రాల చేసిన మార్పులు సముచితంగా ఉండి, అనేక ప్రశంసలు పొందాయి. ఉదాహరణకు... ద్రౌపది సుదేష్ణ మందిరం ముందు నుంచి మాలినిగా మారి నడిచి వెళ్తుండగా, సుదేష్ణ తన దాసీల చేత ఆమెని తన దగ్గరకి పిలిపించుకున్నట్లుగా మూలకథలో ఉంది. కానీ ద్రౌపది, సుదేష్ణల కలయిక దుర్గగుళ్లో జరిగినట్లుగా సముద్రాల మార్చారు, విజయదశమి దుర్గ దయవల్ల వచ్చే పండుగ. ఆ పండుగకు విరాటపర్వంలోని కథకు బాగా సంబంధం ఉంది గనుక ఈ విధమైన మార్పులో ఔచిత్యం ఉంది.

అలాగే కీచకుని మందిరానికి వెళ్లే సమయాన.. సూర్యుణ్ని ప్రార్థిస్తే సూర్యుడు ఒక రాక్షసుని ఆమె రక్షణార్థం పంపిస్తాడు. ఆ రాక్షసుడు అదృశ్యరూపంలో ఆమెను అనుసరిస్తాడు. కీచకుడు మాలినిని వెంటపడి తరుముతుండగా ఆ రాక్షసుడు ద్రౌపదిని ఆవహించి కీచకుడిని బలంగా తోసేసినట్లు మూలకథలో ఉంటుంది. అయితే సముద్రాల రాక్షసుడి ప్రసక్తే లేకుండా కథని నడిపించారు. ఇలా మార్పు చేయడం వల్ల ద్రౌపది అసహాయస్థితి స్పష్టమవుతుంది. దీంతో ప్రేక్షకుల్లో కరుణరసం ఉప్పొంగి, ద్రౌపది పట్ల సానుభూతి మరింత పెరిగింది. దీంతోపాటు ఉత్తరాభిమన్యుల తొలి సమాగమం.. అది కాస్తా ప్రణయంగా మారడం తదితర సన్నివేశాల కల్పనవంటివి సగటు ప్రేక్షకులను రంజింపజేయడం కోసం సముద్రాల సమర్థవంతంగా మూలకథకు చేసిన మార్పులు పసందుగా ఉన్నాయ్.

సంభాషణల విషయానికొస్తే కీచకుడు, బృహన్నల, ద్రౌపది తదితర పాత్రలకు అనుగుణంగా సంభాషణలు పలికించడంలో ఆయన కృషి కనిపిస్తుంది. నటీనటుల ఎంపిక ముగిసిన తర్వాత కీచక పాత్రధారి అయిన ఎస్వీ రంగారావుకి ఒక సుదీర్ఘమైన స్వాగతం ఉంటే బాగుంటుందని చిత్రదర్శకుడు కమలాకర కామేశ్వరరావు సముద్రాలకి సూచించారు. జూనియర్ సముద్రాల పదిహేను నిమిషాల్లో కీచకుడి స్వగతాన్ని రాసి దర్శకుడి చేతిలో పెట్టారు. 'సంధాన సమయమయినది...' అంటూ సాగే పది పేజీల ఆ స్వగతాన్ని దర్శకుడు అలాగే చిత్రీకరించారు. ఆ స్వగతాన్ని చూసి ముగ్ధుడైన ఎస్వీఆర్ "మీరు కీచకుడి కోసం రాసిన సంభాషణలను రసభరితంగా చెబితే చాలు.. నేనింక వేరే నటించాల్సిన అవసరమే లేదు" అని సముద్రాల జంటతో అన్నారట. సుదీర్ఘ సమాసాలతో, సంస్కృత పదాలతో కీచకుని కోసం సంభాషణలు రాసిన సముద్రాల గారే అభిమన్యుని చేత 'పో మామయ్యా... నువ్వెప్పుడూ ఇంతే..' అని వాడుక భాషలో పలికిస్తారు. పింగళి తరహాలో వాలతుల్యుని (అల్లు రామలింగయ్య) పాత్రను సృష్టించడం సముద్రాలలోని హాస్యస్ఫూర్తికి నిదర్శనం. అలాగే బహుముఖ ప్రతిభావంతుడైన సముద్రాల రచించిన గీతాలు 'నర్తనశాల' చిత్రానికి అపు రూపాలంకారాలుగా అమిరాయి.

సాహిత్యంతోపాటు సంగీతం కూడా 'నర్తనశాల'కు సరిగ్గా సమకూరింది. లక్ష్మీరాజ్యం ఆర్థిక సహకారం అందించిన 'సంసారం' (1950) చిత్రానికి సుసర్ల దక్షిణామూర్తి సంగీతం అందించారు. ఆయన ప్రతిభ ఆమెకు అప్పటికే తెలుసు కాబట్టి తమ నిర్మాణంలో రూపొందిన 'హరిశ్చంద్ర' 'శ్రీకృష్ణలీలలు' చిత్రాలకు సుసర్లవారినే సంగీత దర్శకుడిగా పెట్టుకున్నారు లక్ష్మీరాజ్యం దంపతులు. వారి నమ్మకాన్ని ఆయన ఎప్పుడూ వమ్ముచేయలేదు. 'నర్తనశాల' కథ, కథనాల స్థాయికి ఏమాత్రం తగ్గని రీతిలో సుమధుర సంగీతాన్ని అందించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. ఆయన స్వరపరచిన పాటలు, పద్యాలు చిత్ర విజయానికి ఎంతో తోడ్పడ్డాయి. 'జనని శివకామిని..' భక్తిగీతం ఈనాటికీ దుర్గగుళ్లో వినిపిస్తూనే ఉంటుంది. బృహన్నల, ఉత్తరకి నాట్యాన్ని నేర్పే సందర్భాలలో 'గణనాయకుడు..' 'సలలితరాగ సుధారస సారం..' అనే రెండు మధుర గీతాలకు సుసర్లవారు సశాస్త్రీయమైన బాణీలు కట్టారు. బాలమురళీకృష్ణతోపాటు బెంగుళూరు లత అనే నూతన గాయని పాడిన ఈ పాట సినిమా విడుదల తర్వాత బహుళ జనాదరణ పొందింది. దీనితోపాటు 'దరికి రాబోకు రాబోకు రాజా" 'నరవరా ఓ కురువరా' 'ఎవరికోసం ఈ మందహాసం', 'సఖియా వివరించవే..' పాటలు ఆల్‌టైమ్ హిట్స్

'నర్తనశాల' కోసం అద్భుతమైన సెట్స్‌తోపాటు, కీలకమైన బృహన్నల స్కెచ్‌లు గీసి సినిమాను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన కళాదర్శకుడు టి.వి.ఎస్.శర్మ, ఆయన తన పదవ యేటనే ప్రమాదవశాత్తూ ఎడమచేతిని కోల్పోయాడు. 'కుడిచేయి పోలేదు.. అదే పదివేలు' అని సమాధానపడి మొక్కవోని పట్టుదలతో చిత్రకళని అభ్యసించారు. కళాదర్శకుడిగా సినిమారంగంలో ప్రవేశించి మంచిపేరు సంపాదించుకున్నారు 'బృహన్నల' పాత్ర ధరించడానికి మొదట ఎన్టీఆర్ అంగీకరించలేదు. కానీ 'శర్మగారి స్కెచ్‌లు చూసిన తరువాతే మీ తుది నిర్ణయం మాకు చెప్పండి' అంటూ నిర్మాత లక్ష్మీరాజ్యం ఒత్తిడి చేసింది. బృహన్నల స్కెచ్‌ల రూపకల్పనకు శర్మపడిన శ్రమ అసాధారణమైనది. ఆ పాత్రను ఎన్టీయార్ అద్భుతంగా పోషించారు.


రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

044 25204046, 26171341



# ధరణికి గిరి భారమా!
# గిరికి తరువు భారమా!
# కనిపించే తల్లికి పిల్ల భారమా!

**వీటివేటినీ భారంగా తలంచదు కాబట్టే, తల్లి బిడ్డను కనడానికి గానీ, పెంచడానికి గానీ, దేనినీ భారంగా తలంచదు.**

**అందుకే తల్లిని మించిన దైవము వేరే ధారుణి లేదోయీ- అన్నాడో సినిమా కవి. తల్లికావడం అంత తేలికైన విషయం కాదు. తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి బిడ్డకు జన్మనిస్తుంది. అదా తల్లికి పునర్జన్మ అనుకోవాలి.**

**ఆ బోసి నవ్వుల బిడ్డను చూచి మురిసిపోతుంది. మనదేశంలో బిడ్డను కనడం ఓ భాగ్యంగా భావిస్తారు. పెంచడం మరో భాగ్యంగా తలపోస్తారు.**

**అమ్మకావడం ఎంత అదృష్టమో! అమ్మలా ఆ బిడ్డను లాలించడమూ అంతటి అదృష్టమే! ఇలా బిడ్డల్ను సాకే అదృష్టం మన సంస్కృతిలోనే ఉన్నది. బిడ్డలను చను కుడిపి పెంచే సంస్కృతి మన దేశంలోనే ఉన్నది.**

**కనడం కన్నా పెంచడంలోనే తల్లులు పరిపూర్ణమైన ఆనందాన్ని పొంద గలుగుతారు**

సృష్టిలో తీయనైనదేఁవిటంటే తల్లిప్రేమ. అనసూయాదేవి త్రిమూర్తులను బిడ్డలుగా చేసుకుని తల్లి ప్రేమను పొందింది.

చిరునవ్వులు చిందించే పసిపాప అంటే వేరెవరో కాదు, జాతి యావత్తుకు కావలసిన సమిష్టి సంపద. అతడే రేపటి మానవజాతికి జనకుడు.

ప్రపంచంలో కొత్తగా వచ్చే ప్రతి పసివాడు భగవంతుడి నుండి విలువపైన సందేశమును తీసుకొని వస్తాడు. భగవంతుడు మనుషుల వలన, వారి ప్రవర్తనల వల్ల ఇంకా నిరాశ చెందలేదని తెలియజేస్తారు. బాల్యంలో మనిషికి స్వర్గం దరిదాపుల్లోనే ఉంటుంది. ఎదిగే కొద్దీ అది దూరం అవుతూ వుంటుంది. చిన్నారి శిశువు దేవదూత వంటివాడు. ప్రపంచంలోకి అడుగుపెట్టిన తరువాత అతడికి కాళ్లు పొడవవుతుంటాయి. రెక్కలే క్రమేణా తరగిపోతుంటాయి. మనిషి తన అసలైన జ్ఞానం సాయంతో మధురమైన బాల్యాన్ని మరోసారి పొందడానికి, భగవంతుడు అప్పుడప్పుడు అరుదైన అవకాశాలు కల్పిస్తుంటాడు. పసిబిడ్డలు ప్రతి కుటుంబానికీ, పసిడి కాంతులు అందించే అందమైన ఆభరణాలు, పసిబిడ్డ నడయాడని పది అంతస్థుల భవనమైనా, అది దయ్యాల కొంపే. అసలు నిజమైన స్వర్గం పసిపాపల ఆనందంలోనూ, వారి సంపూర్ణ ఆరోగ్యంలోనూ తొణికిసలాడుతూ వుంటుంది.

పువ్వులను ఇష్టపడనివారెవరుంటారు? పిల్లలు నవ్వులను ఇష్టపడని వారెవరుంటారు? పిల్లలు ఆట లాడని తోటలో వసంత ఋతువు ప్రవేశించడానికి ఇష్టపడదు. పిల్లలు పాటలు పాడని వనంలో కోయిలలు 'కుహూ' కూతలతో పరవశింపజేయవు. హత్యలు చేసే హంతకుడిని చూచి కూడా చిరునవ్వులు చిందించగల సంస్కారం పిల్లలదే! పసిపిల్లల నవ్వులు జీవితాలలో వెలకట్టలేని పువ్వులు.

రేపటి పౌరులను తయారు చేసే కర్మాగారాలు పిల్లలున్న యిండ్లే. ప్రేమ ఆప్యాయతలను వెదజల్లే ప్రతి గృహం ఒక మినీ విశ్వవిద్యాలయమే. నేటి బాలలే రేపటి పౌరులు. అక్కడ ఆచార్యులకు బదులుగా తల్లిదండ్రులు బాధ్యతలను పైన వేసుకొంటారు.

ప్రతి తండ్రి తన బిడ్డలను సభల్లో, సమావేశాల్లో మొదటి వరుసలోనే కూర్చునే అర్హత కలవారిలా తయారు చేయాలంటారు తమిళకవి తిరువళ్ళువర్.

తల్లిదండ్రులు తమబిడ్డలకు చిన్నతనంలో నడవటం, మాట్లాడడం దగ్గరనుండి నేర్పుతూ తాము మురిసిపోతుంటారు. అదే తల్లిదండ్రులు కొంత కాలం తరువాత చురుకైన తమ పిల్లలను క్రమశిక్షణ పేరుతో కదలకుండా, మెదలకుండా కూర్చోమని వత్తిడి చేస్తారు. పిల్లల నుండి మనం పెద్దవాళ్లం నేర్చుకోవలసింది ఏమైనా వుందా? అంటే ఉన్నది. అది లభించిన జీవితాన్ని అనుభవించి, ఆనందించడమే.

బాల్యదశయటన్న భావి జీవిత సుఖక్షేత్రమందు నాటు విత్తనం అంటారు అభినవ పోతన బిరుదాంకితులు శ్రీవానమామలై వరదాచార్యులవారు.

మానవ జాతికి ప్రకృతి ప్రసాదించిన వరాలన్నింటిలో పిల్లల కంటే మధురమైనది ఏమున్నది అంటాడు సిసిరో.

భూములు కావు, భవనాలు కావు ఆభరణాలు నిజమైన సంపదలు కానేకావు. పిల్లలే తల్లిదండ్రుల నిజమైన సంపద కాదు, కాదు వారు జాతి సంపదలు. బాగా ఆలోచిస్తే విశ్వసంపదకు శాశ్వత వారసులు వారే.

మానవ భవితవ్యం వేరెక్కడో లేదు. పిల్లల చేతుల్లోనూ. వారి చేతుల్లోనూ అంటాడు అబ్రహాంలింకన్.

దినానికి ఉషోదయం ఎటువంటిదో జీవితానికి బాల్యదశ అటువంటిది అంటాడు జాన్ మిల్టన్.

విభిన్న భాషలు మాట్లాడుతూ, వివిధ రకాల దుస్తులను ధరిస్తూనే వేర్వేరుగా వున్నా అందరూ ఒక్కలాంటివారే. వారు తమమధ్యగల కుల, వర్గ, వర్ణ, అంతస్థుల గురించి ఆలోచించరు. ఈర్ష్యాసూయల దరిచేరని ఆటపాటలలో వారు మునిగి తేలుతుంటారు అని అంటారు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ.

**బాలబాలికలె భావి ప్రపంచపు ఏలికలు**
**బాల బాలికలె జగతికి ప్రగతి దీప మాలికలు,**
**బాల బాలికలె, జాతికి ప్రాణమిచ్చు మూలికలు,**
**బాల బాలికలె, సమతకు బంగారపు డోలికలు**
**పిల్లలూ, దేవుడూ చల్లనివారే!**
**కల్లాకపటమెరుగని కరుణామయులు**

**-కరుణశ్రీ (జంధ్యాలపాపయ్యశాస్త్రి)**



# ఒక్కసారి భీమిలీ తీరానికి వెళ్ళు కవిత్వంలో తడిసిరాకపోతే అడుగు!



అర్థమైన దానికన్నా అధికంగా స్ఫురించేది, చేతలకు చెందరాని మాటలకు అందరానిది కవిత్వం! అందుకే

**'కవిత్వం కావాలి కవిత్వం**
**అక్షరం నిండా జల జలలాడిపోయే**
**కవిత్వం కావాలి"** అన్నారు.

నిజం! ప్రతికవితా బోలెడంతా విశ్వాసాన్నీ, ఆనందాన్నీ, కల్గించకపోతే కవిత్వమెందుకు? అది వంటరితనంతో సంభాషించగలగాలి. లోకంలోని విశాలత్వం మనకు బోధించగలగాలి. కవి అప్పుడప్పుడూ స్వప్నలోక సంచారి అవుతాడు. వెన్నెల్లో విహారం చేస్తాడు. కవిత్వాన్ని ఆస్వాదించే మనల్ని కూడా తన వెంట విహారం చేయిస్తాడు. మన ఆందోళనలను మంచులాగా కరగదీస్తాడు. అశాంతిని అలవోకగా తరిమేస్తాడు. సముద్రతీరాలకు, కొండచరియల్లో ఉరకలెత్తే జలాల వైపు మనల్ని నడిపించి రమణీయ ప్రకృతిని కనువిందు చేయిస్తాడు.

ఆకుపచ్చని అటవీ సీమల వెంట, సరస్సుల వెంటా నడిపించి కొత్త అనుభవాలతో దుఃఖాన్ని మరిపిస్తాడు. విశాఖలోని భీమ్లీ సముద్రతీరాన్ని దర్శించి పరవశించిన కవుల కవిత్వాన్ని ఓ మారు విశ్లేషించుకుందాం!

భీమ్లీసముద్రతీరం విశాఖకు 24 కిమీ దూరంలో ఉంటుంది. ఇది భారతదేశంలోనే అతి పొడవైన సముద్రతీరం. ఈ చిన్నపట్టణంలోని భీమేశ్వర స్వామి దేవాలయం ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తుంది.

ఈ దేవాలయం 1220 సంవత్సరంలో శాలివాహన శకంలో నిర్మించబడినట్లుగా తెలుస్తుంది. సముద్రతీరం పొడవునా చిన్న చిన్న దేవాలయాలు కన్పిస్తాయి. దారిలోనే ఎర్రమట్టి దిబ్బలుఎంతో అందంగా కన్పిస్తాయి. ఎర్రటి ఇసుకలో మెరుస్తూ కన్పిస్తాయి. ఇక్కడి క్లాక్‌టవర్, లైట్‌హౌస్ యాత్రికుల్ని ఆకర్షిస్తాయి. వీటి నిర్మాణంలో డచ్‌వారి చిత్రకళ కన్పిస్తూ వుంటుంది.

ఒక నిద్రిస్తున్న చిన్నపట్టణం భీమిలి. దేశంలోనే రెండవ పురాతన మున్సిపాలిటి. ఒక కోటతోపాటు డచ్ నిర్మించిన స్మశానం శిథిలాలు ఇప్పటికీ అక్కడ చూడవచ్చు. సముద్రంలో కాంతి కోసం ఒక లైట్‌హౌస్ దగ్గరగా ఉంది.

కవిత్వాన్ని గాఢంగా ప్రేమించిన వ్యక్తిగా జీవితాన్ని గొప్పగా ప్రేమించిన రచయిత్రి ఆదూరి సత్యవతీదేవి. జీవితాన్ని కుదిపేసే వేళ కవిత్వమే తనను ఊరడిస్తుందని, చేయూతనిస్తుందనీ నమ్మిన సత్యవతీదేవి మనమధ్యలేదు. అయినా ఆవిడ కవిత్వంలోని రసదృష్టికీ, సౌందర్యకాంక్షకీ మనం మైమరచిపోక తప్పదు. విశాఖ తన నివాసం. విశాఖ తన కవిత్వం. భీమ్లీ తన చూపులకు మెత్తగా స్వాగతమిచ్చే కొత్త గవాక్షం–

**'ఆ దారంట నడుస్తూండే**
**ఎవరో అనాది పురుషుడు**
**పెద్ద నీళ్ల దుప్పటి కప్పుకు పడుకున్నట్లు**
**సముద్రం మడతలు మడతలుగా పరుచుకుంటుందక్కడ–**
**బారెడు పొద్దెక్కింది నిద్రలేవమని**
**వుంటే వుండంటూ ఎవరో చక్కిలి గిలి పెట్టినట్లు**
**చిరు కదలికలతో బద్ధకంగా అలల నవ్వుల్ని చిలకరిస్తుంది!**
**లేలేతగా ఇసుక మీదకు ఉరికే సముద్రం**
**పాపాయి కాలివెండి మువ్వల పట్టీలా**
**తరగ గజ్జెలతో వూగుతూ**
**పట్టు మేఘం పారాడుతున్నట్లుంటుంది!**
**అక్కడి గాలి గుసగుస విసురలకి**
**కళ్లలో కవిత్వపు నలుసుపడి**
**ప్రాణం తియ్యగా జివార్చుతుంది!**
**అలవికాని ఆ భావాలహరులు**
**శబరి కొరికిన ఎంగిల పళ్లయి**
**చెల్లా చెదురౌతాయి!**
**అందుకే ఆ తరితీపి దృశ్యాల్ని**
**కళ్లలో పెట్టుకు దాచుకోవాలే గాని**
**కవిత్వంలో పట్టుకోలేననిపిస్తుంది'!**

**–ఆదూరి సత్యవతీ దేవి**

భీమ్లీ ఒడ్డున ఉదయాన్ని పల్కరించి పరవశించి పోతున్నా కవి అద్దేపల్లి శ్రీరామమోహనరావు సూర్యుడి పైకి లేస్తూ తన కిరణాలు కొన్నింటిని ఒడ్డున రేణువులకి పంచుతాడు కాబోలు. మెత్తటి ఇసుకపై నడుస్తున్న నీ పాదముద్రల్ని మెరుపుల్తో ఆహ్వానిస్తుంది. గుంటలో చేపల్లా చేపల మధ్య ఈదే పిల్లల కళ్లలో అమ్మ తడికొంగు పట్టుకుని ఆటలాడే పసి పండగల ప్రతిబింబాలుగా కనిపిస్తాయంటూ–

**'ఎదురుగా సమాధుల్లోంచి ఎప్పటివో**
**'డచ్చి' మూలుగులు వినిపిస్తూ ఉంటై!**
**పెద్ద సమాధుల్లోని ప్రభువులు**
**రాచఠీవితో గడ్డకట్టిపోతారు!**
**చిన్న చిన్న సమాధుల్లోని పేదవాళ్లు**
**వాళ్లపై నుండి వచ్చే గాలికి ఒణికిపోతుంటారు!**
**ఊపిరి సలపని ఆయాసంతో విశాఖ యాంత్రిక జీవితం**
**భీమ్లీ బీచికి వచ్చి హాయిగా**
**ప్రాణాయామం చేసుకుంటుంది!**
**గోలగోల గోలగా ఉండే బీచిల్లో**
**'ఎంజాయ్' చెయ్యాలంటే ఎక్కడికైన వెళ్లు!**
**సముద్ర భుజం మీద చెయ్యేసి**
**నిశ్శబ్దంగా పలకరించి**
**నిన్ను నువ్వు చూసుకోవాలనుకుంటే మాత్రం**
**భీమ్లీ కెళ్లు'**

**–అద్దేపల్లి రామమోహనరావు**

(సశేషం)

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# పరిచయమే అక్కరలేని - అమ్మ



**మ**న భారతీయ సంస్కృతి మొత్తం మాతృ సంస్కృతి.

నదులను స్త్రీమూర్తిగా, మాతగా పూజిస్తాం! గోవును గోమాతగా కొలుస్తాం!

భూమిని భూమాతగా కీర్తిస్తాం.

మన దేశాన్ని భరతమాతగా ఆరాధిస్తాం.

మాతృమూర్తిలోనే యీ సకల చరాచరసృష్టి ఉందని విశ్వసిస్తాం.

'అమ్మ'– ప్రతి శిశువు నోటివెంట వచ్చే తొలిపలుకు ఈ రెండక్షరాలు అమృతబిందువులు. ఆత్మీయతా సింధువులు. అమ్మకు నిండైన నిర్వచనం అమ్మే. అమ్మ వినా దైవం లేదు. పగలూ రాత్రీ అనక, విశ్రమించక కన్నవారి కోసం పరిశ్రమించే ప్రాణి యంత్రం.

హృదయంతో ఎవ్వరూ మాట్లాడలేరు– ఒక అమ్మ తప్ప!

అష్టాదశ పురాణాలను రచించిన వేదవ్యాసుడు 16 శ్లోకాల్లో ముకుళిత హస్తాలతో వాయుపురాణంలో వ్యక్తపరచిన మాతృవందనం ఎందరికి తెలుసు? ఒక్క వరప్రసాద్ రెడ్డికే తెలియచెప్పడం తెలుసు.

**అమ్మది షరతుల్లేని ప్రేమ–**
**అమ్మది ప్రతిఫలం ఆశించిన సేవ–**
**గర్భస్థ శిశువుకు తన ఊపిరి, తన ఆహారం పంచే త్యాగం–**
**పొత్తిళ్లలోని పాపకు తన స్తన్యమిచ్చి జీవం పోసే దేవత**
**తొలిగోరు ముద్దలు తినిపించి కడుపు చల్లపరుస్తుంది**
**తొలిపలుకులు నేర్పించి, పలికించి మనసు వికసింపచేస్తుంది**
**సహనానికి భూదేవి– వాత్సల్యానికి ఆకాశం– సేద తీరడానికి వేసవి వెన్నెల**
**అమ్మంటే ఓ తరంగం - నిరంతర ప్రవాహం - నిత్య పరిమళం**
**అమ్మంటే పచ్చగా పండి ఒరిగిన చేను**
**అమ్మంటే నిండుగా పండిన రసాల మామిడి తోట**
**అమ్మంటే పోతన 'మందార మకరందం'**
**అమ్మంటే కృష్ణశాస్త్రి 'కవితా కల్హారం'**
**అమ్మంటే నారాయణరెడ్డి 'రసరమ్య గీతం'**

※ ※ ※

**నిజానికి అవేవీ దీటు రావు అమ్మకు–**
**అమ్మలాంటిది ఎవరంటే ఒకే ఒక అమ్మే! అంతే!**
**అమ్మ ఋణం తీర్చుకోలేము–**
**అమ్మకు అమ్మెప్పుడితే తప్ప!**
**అమ్మకు జేజేలు!**

1 ఆగస్టు 14, (**వరప్రసాద్‌రెడ్డి,** హైదరాబాద్ వారికి కృతజ్ఞతలు)

# పల్నాటి సోదరకవులు ప్రభులింగాచార్యులు వీరభద్రాచార్యులు

**వీర శౌర్యజ్యోతి వెల్గించు పల్నాటి**
**పుణ్యస్థలంబు మా పురిటిగడ్డ!**
**నవర్ణతముల కొండ నాగార్జునుని కొండ**
**ప్రియమిచ్చు మా శిల్ప పీఠభూమి!**
**విపులవాహిని కృష్ణవేణి మహానది**
**విరివిగ సాగు మా పెరటివాగు!**
**మహిమలన్ జూపించు మాచర్ల చెన్నుండు**
**హితము చేకూర్చు మా ఇంటివేల్పు!**
**నందికొండకు దిగువ చెన్నొందుచున్న**
**కమ్మ దానిమ్మ కొమ్మ నా కాపురమ్ము!**
**ఘనులు పల్నాటి సోదర కవుల చెంత**
**పలుకు నేర్చిన తెలుగు రాచిలుక నేను!**

–అంటూ తమ పల్నాటి గడ్డకు ప్రణతులర్పించారు. మహాపురుషుల జీవిత చరిత్రలకు ప్రభులింగాచార్యులుగారి పోతన, వీరభద్రా చార్యులుగారి భువనజ్యోతి (గాంధీజీ) పొట్టి శ్రీరాములు, పలనాటి పోతన, సుబ్బదాసు జీవిత చరిత్రలు ప్రముఖంగా పేర్కొనదగినవి.

ఈ సోదరకవులు పల్నాడును కొనియాడిన విధానంలోని అక్షఱ అక్షఱంలోనూ అంతులేని, గొంతు నారనీయని సుస్వర సౌమనస్యం ఉన్నది. అందరు కవులకూ అలవడే అక్షఱం సౌందర్యంకన్నా అద్భుతపోకడల ఊట బావియని పై పద్యమే చెబుతున్నది. ఇహ తెలుగు కవుల సొంపును కనుసొంపుగనెలా కూర్చినదీ ఈ పద్యం చూడండి:

**తుమ్మల విశ్వనాథుల స్వస్తివచియింప**
**దేవులపల్లి మేల్ దివ్వెపట్ట,**
**కాటూరు పింగళుల్ కైవారములు పల్క**
**రాయప్రోల్ కనకనేత్రమ్ము దాల్ప**
**వేదుల జంధ్యాల వింజామరల వీవ**
**తెలుగురాజు పతాక కలిమిఁజూప**
**జాషువా యేటుకూర్ జాతిగీతికపాడ**
**నాయనివారు సన్నాయినూద**
**తాపి బాపిరాజులు పూలదండలిడగ**
**నభ్యుదయ నిశ్వనములు మిన్నంటి మ్రోగ**
**సాగుచున్నది నీ మహోత్సవము నేడు**
**ఆంధ్రకవితా సవిత్రి! దీర్ఘాయురస్తు!**

అంటూ సమర్థులైన కవులను, వారి వారి స్థానాలను వీరు లెస్సగా లెక్కకట్టారు.

అర్ధశతాబ్దానికి పైగా తెలుగుతల్లిని అలంకరించారీ పల్నాటి సోదర కవి కుమారులు. ఇరవయ్యో శతాబ్దమున ద్వితీయ దశకంలో ప్రభులింగాచార్యులు గారిచే ప్రారంభమైన వారి కవితావాణి, 1974వ సంవత్సరంలో వీరభద్రా చార్యులుగారు కైవల్య పరమపదం చేరే వరకు తెలుగునేల మారుమ్రోగింది.

ఒక్కమాటలో చెప్పాలంటే...

**పుణ్యపురుషుల జీవితంబులను దెల్ప**
**కవుల కమ్మని హృదయముల్ కదలుగాక!**
**పుణ్యపురుషుల జీవితంబుల లిఖింప**
**కవుల బంగారు కలములు కదలుగాక!** – అంటారు.

వీరి అభివ్యక్తిత కవిత్వాన్ని తెలుగుసాహితీ ప్రియులు పునర్ముద్రిస్తే బాగుంటుంది అనే మాటలతో ఏకీభవిస్తున్నాను. (పూర్తి వ్యాసము లభింపకున్ననూ, కొంతైనా వీరి కవితామందార మకరంద కోసమే ఈ వ్యాసం). ●

# శ్రీశ్రీ- మరోప్రపంచం - మహాప్రస్థానం - మరో ప్రస్థానం

**తెలుగు సాహితీ జగత్తులో**
**శబ్దాలే ప్రళయాబ్దాలుగా**
**భావాలే ఎర్రబావుటాలుగా**
**ఎగరేసిన ఉగ్రచైతన్యమూర్తి – శ్రీశ్రీ**
**భావకవితాయుగంలో**
**శ్రీశ్రీ తిప్పిన తొలిమలుపు**
**అభ్యుదయ విప్లవ యుగాలకు**
**మేలు కొలుపు**
**వెనుదిరగని ప్రస్థాన శక్తులకు**
**వెన్ను చరుపు.**

కదం తొక్కుతూ, పదం పాడుతూ, హృదంతరాళం గర్జిస్తూ, పదండి ముందుకు, పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి... అంటూ మరో ప్రపంచానికి తెలుగు ప్రజలను ముందుకు తీసుకువెల్లిన మహాకవి శ్రీశ్రీ.

మరో ప్రపంచం ఎక్కడుంది? ఎక్కడో లేదు ఇక్కడే ఉంది. అది ఈ భూ ప్రపంచమే! ఆర్తులు, అనార్తులు, బాధాస్పద్రష్టులు, తాడితులు, పీడితులు లేని సమానత్వం ప్రాతిపదికగా పునర్నిర్మించుకునేదే మరో ప్రపంచం. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలారా, ఈ నూతన సోషలిస్టు భువన భవనాన్ని మనకు మనమే స్థాపించుకున్నాం. రండి, కదలిరండి అని ఆహ్వానించాడు. శ్రీశ్రీ.

వర్గ సమాజంలో కాయకష్టాన్ని ఉపయోగించి వస్తూత్పత్తి చేసేది ఒకరైతే దాని ఫలితాన్ని అనుభవించేది మరొకరు. పనిచేసే వాళ్లు శ్రామికులు, హాయిగా అనుభవించేవారు యజమానులు. వస్తూత్పత్తి చేసినందుకు శ్రామికుడికి ఇచ్చే 'కూలి'కి ఆ వస్తువు అమ్మకం విలువకి మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. వస్తూత్పత్తికయ్యే ఖర్చుకు, అమ్మకం వల్ల వచ్చే విలువకు మధ్య చాలా తేడా వుంది. ఈ తేడానే అదనపు విలువ. సాహిత్య ప్రక్రియలన్నీ ఆధునికతను సంతరించుకున్నాయి. తెలుగు సాహిత్యంలో అదే జరిగింది. అది శ్రీశ్రీ ద్వారా జరిగింది. రాయప్రోలు సుబ్బారావు గారి అభినవ స్వరకల్పన కాలంలో పుట్టి అటు విశ్వనాథ, ఇటు కృష్ణశాస్త్రినీ అంటిపెట్టుకొని కాల్పనికోద్యమ కవుల్లో పుట్టింది. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అంటూ కాల్పానిక నుంచి బయటపడ్డాడు. తన వైయక్తిక చైతన్యాన్ని సామాజిక చైతన్యంగా రూపుకట్టించాడు.

దేశమంటూ మనుషులోయ్' అన్న గురజాడ ప్రబోధాన్ని అందుకున్నాడు. ఆ మనుషులెవరో నిర్ణయించుకున్నాడు. 'చారిత్రక యధార్థతత్వం' వైపు నడిచాడు. లోకంలో ఎందుకు కొరగానివనిపించే వస్తువులు, కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా– కవితా మయమేనని నిరూపించాడు. కవితావేశమనేది ఉండాలేగాని రసనిర్దేశానికి కొదవేమిటి? 'నవకవిత'కు కావలసిన సరంజామాలో శ్రీశ్రీ చేర్చిన అంశాలు గమనిస్తే ఆధునిక యుగంలో యంత్ర నాగరికత సమకూర్చిన సరకులెన్నైనా కనిపిస్తాయి. కవిత్వ ధ్యేయాన్ని కూడా సరికొత్తగా నిర్ధారించుకున్నాడు. కవిత్వాన్ని జోలపాటగా కాకుండా మేలుకొలుపుగా మార్చాడు. 'పెను నిద్దర వదిలిస్తూ పరిపూర్ణపు బతుకు'ను ఇచ్చేదిగా కవితను తీర్చిదిద్దాడు. ●

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి

## హరిద్రా కుంకుమ పారిశ్రామికవేత్త

# హరికృష్ణ

## -గోపురమంత మంచితనాన్ని గోప్యంగా ఉంచుకున్నాడు!!-



**హరికృష్ణా యెప్పుడు పుట్టావయ్యా! మోమున చిలికే మందహాసం యెప్పుడు పుట్టిందయ్యా?**

**1948 సంవత్సరం డిసెంబర్ 18వ తేదీన చెన్నయ్‌లో జన్మించారు. '9' జన్మదినతేదీ సంఖ్య ఎంతో రాశిగలదంటారు. ఆయన రాశీ గొప్పదే; వాసీ గొప్పదే! చేస్తూండే పసుపు కుంకుమ ఉత్పత్తి వ్యాపారమూ గొప్పదే!**

**ఆయన్ను చేబట్టిన మ॥లు॥స॥ కృష్ణకుమారి రాశీ గొప్పదే! ఇన్ని గొప్పల ఒప్పరి. వై.వి. హరికృష్ణ మహర్జాతకుడు. మంచిని మకుటంగా కలిగినవాడు.**

ఆంధ్ర తమిళనాడు కర్ణాటకల్లో ఏ యింటికి పుణ్యస్త్రీలు వెళ్ళినా, ఉండమ్మా బొట్టుపెడతా నంటూ గోపురం కుంకుమంతో బొట్టుపెట్టి పంపిస్తారు. ఇంకా ఆత్మీయ ఆడపడుచులైతే కాళ్ళకు గోపుర పసుపు రాసి, మోమున ముద్దమందారపు బొట్టు పెట్టి పంపిస్తారు.

ముద్దబంతి పూవులా పసుపు కాంతీ, ముద్ద మందారం రంగులో కుంకుమ బొట్టు చూచి– పసుపు కుంకుమలింత శోభాయమానంగా ఉన్నాయేమని అడిగితే – 'గోపురమమ్మా! గోపురం' అంటారు.

ఒహో గోపురం పసుపూ, గోపురం కుంకుమలా? 1952 సం॥ము నుంచీ మేమవే వాడుతున్నామంటారు.

ముందు ఆలోచనలతో 1945 సం॥ములో ఆర్యవైశ్య కులోద్భవుడు యెరసాల వెంకటశేషాచలం (వైవి. శేషాచలం) గారు శ్రేష్టమైన పసుపుకొమ్ములను క్రయం చేసి, పసుపుపొడి, కుంకుమల్ను తయారు చేయడం ప్రారంభించారు. స్థాపించిన వేళా విశేషమేమోగానీ వాటికి మార్కెట్లో మంచిపేరు వచ్చింది. 1952 సంవత్సరంలో మరో మంచి ఆలోచనం కలిగి గోపురం ట్రేడ్ మార్కును రిజిష్టరు చేయించారు.

రెండవతరం (వారి సంతానమే) వై.వి. హరికృష్ణ, వై.వి. సారంగపాణి – గోపురం పసుపురాయని గడపా, గోపుర కుంకుమ ధరించిన ఇంటివారూ లేరని పించేట్టు వ్యాపార విస్తరణం చేసారు.

పండుగలకు పబ్బాలకూ– పూజలకూ పునస్కారములకూ, దేవతా పూజలకూ, దేవాలయ అర్చనలకూ గోపురం కుంకుమ, పసుపు అమ్మకాలు గోపురస్థాయికి చేరుకున్నాయ్. గోపురం ట్రేడ్‌మార్కు నెందుకు యెన్నుకున్నారోగానీ, దక్షణ భారతమంతటా గోపుర పసుపు కుంకుమల వ్యాపారం విస్తరించి, వింధ్య పర్వతశ్రేణిని దాటి ఉత్తరాదిలో ప్రవేశించింది.

కర్ణాటకలో 40 సంవత్సరములుగా, ఆంధ్రప్రదేశ్‌లో 25 సం॥ములుగా, తమిళనాడులో ప్రారంభించిన కాలం నుంచీ గోపురం పసుపు, కుంకుమ వ్యాపారం ప్రసిద్ధిగన్నాయ్. రోజూ ఓ లారీ లోడు విక్రయాలు జరుగుతూనే ఉంటాయ్.

చెన్నయ్‌లోనే 6 ఫ్యాక్టరీలున్నాయ్. 6 డిపోలున్నాయ్. మద్రాసు, బెంగుళూరు, విజయవాడలో గోపుర పసుపుకుంకుమ కార్యాలయ శాఖలున్నాయ్. ఉపశాఖ లున్నాయ్. ఏజెన్సీలున్నాయ్. ఇంత విస్తరణ వెనుక సరళ, సౌమ్య సౌజన్య హృదయనేత్రుడైన హరికృష్ణ ఉన్నాడు.

మూడవతరంగా హరికృష్ణ అల్లారు ముద్దు తనయుడు వై.వి.నిరంజన్ కృష్ణ ఉన్నాడు. నిరంజన కృష్ణుడు విద్యాధికుడు.

ఎంత సంపద ఉన్నప్పటికినీ, వినయ సంపదలేనినాడు వ్యాపారం వృద్ధికాదు.

వై.వి. శేషాచలం గారి జనకులు యెరసాల వేంకటరామానుజులు గారు 1940 సం॥ములోనే పట్టభద్రులు. పోలీసు డిపార్టుమెంటులో పనిచేసి పదవీ విరమణం చేసారు. వారి తాతగారు రంగనాయకులు చెట్టిగారు ఆగర్భ శ్రీమంతులు. విదేశాల నుంచీ వజ్రవైఢూర్యాలను పెద్దయెత్తున దిగుమతి చేసుకుని వ్యాపారం చేసేవారు. వారి మామగారు వుమ్మిడి బంగారు చెట్టి బంగారు, వెండి, రత్నాభరణ వ్యాపారులు. ఇప్పటికీ వుమ్మిడి బంగారు చెట్టి వంశజులే బంగారు రత్న, రజిత, ఆభరణ వ్యాపారం చేస్తున్నారు.

చెన్నపట్టణం పుట్టినప్పట్నుంచీ ఆర్యవైశ్యులే వాణిజ్య రంగంలో ఉన్నారు. ఆర్యవైశ్యులు ఆరాధనీయమైన కన్యకాపరమేశ్వరీ దేవాలయం షావుకారుపేట ఏర్పడనప్పట్నుంచీ 300 సంవత్సరాలుగా ఉన్నది.

ఇంతటి ఘనచరిత్ర కలిగిన ఆర్యవైశ్యుల్లో యెరాసల వెంకట హరికృష్ణ (వై.వి. హరికృష్ణ) వ్యాపార విజ్ఞుల కుటుంబంలో పుట్టారు. వారు జన్మించినది చెన్నయ్ నగరం. వారి విద్యాభివృద్ధి చెన్నయ్ మహానగరంలోనే జరిగింది. విద్యాధికుడైన తరువాత చెన్నయ్‌లోనే వ్యాపారం ప్రారంభించారు. జార్జిటౌను, త్యాగరాజనగరం నుంచీ అన్నానగర్ వరకూ వారి నివాసప్రస్థానం జరిగింది. అన్నానగర్‌లో ప్రశాంతమైన ప్రాంతంలో వారి మనసుకు తగినట్లు గృహాన్ని కట్టుకున్నారు. వారి అబ్బాయి నిరంజన్ కృష్ణకు తిరుపతిలోని పసుమర్తి జయరాం, చంద్రావతి దంపతుల కుమార్తె చి॥సౌ॥ హారికతో వివాహం జరిపించారు. వారికి ఒక అమ్మాయి ఆదిత్రి, అబ్బాయ్ ఆద్యంత్ సంతానం. వారి అమ్మాయి సౌ॥ ప్రణవి కృష్ణను, వివేక్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోదండరామచెట్టి పుత్రుడు చి॥ బి.కె. విజయ్‌కిచ్చి వివాహం చేసారు.

హరికృష్ణ కుమారుడు వివాహానికి తిరుపతి, కుమార్తె వివాహానికి చెన్నయ్ వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించి వచ్చాను. హరికృష్ణ అనుంగు గౌరవంతో వసతి ఏర్పాట్లు చేసాడు. అంతమంది ఆహ్వానితుల్లో నాకు ప్రత్యేకమైన గౌరవాన్ని చూపించడంలో హరికృష్ణ ఆత్మీయ ఆప్యాయతలు అపారమైనవని చెప్పాలి.

'ప్రముఖాంధ్ర' పట్ల ఆయనకు ప్రత్యేక ఆదరాభిమానాలున్నాయ్.

వై– హరికృష్ణయని ఎందుకన్నారో గానీ – ఎస్. హరికృష్ణ అనడం సమంజసం. ఎప్పుడు ఏవఁడిగినా 'వై' అనడు. 'ఎస్' అంటాడు. నా ప్రతీ పుట్టినరోజుకూ పసుపు కుంకుమలతో, ఫలములు, కలములతో నూతనవస్త్రాలను పంపే తొలివ్యక్తి హరికృష్ణ. నిండు నూరేండ్లు ఆయురారోగ్య సౌభాగ్యములతో వర్ధిల్లాలి. ●

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station), TIRUPATI - 517 501 (A.P.)**

**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**

**Website : www.bhimasdeluxehotels.com**

**E-mail : bhimasdeluxe@rediffmail.com**



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



## 98

## పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

**అర్జున ఉవాచ:-**

**1. సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్**
**త్యాగస్య చ హృషీకేశ! పృథక్కేశి నిషూదన.**

**వ్యాఖ్య :** గీతయం దింతదనుక అనేక ప్రసంగములందు శ్రీకృష్ణపరమాత్మ సన్న్యాస, త్యాగ శబ్దములను వాడుచు వచ్చిరి. కాని వానిని గూర్చిన వివరణమును తెలిపి యుండలేదు. (శ్లో॥ 3-30, 4-20, 4-41, 9-28, 12-6, 12-12, 12-16, 12-25) అందువలన అర్జునునకు వాని వివరములు తెలిసికొనవలెనను కాంక్ష ఉదయింప వానిని గూర్చి భగవానుని యిట్లు ప్రశ్నించెను.

(ఉపనిషత్తులందు సన్న్యాసము, త్యాగము, రెండును మోక్షమునకు హేతువులని చెప్పబడినది.

(1) 'త్యాగేనైకే అమృతత్వ మానశుః' - (2) సన్న్యాసయోగాద్యతయశ్శుద్ధసత్త్వాః .... ఇత్యాది వాక్యము లనేకములు ఉపనిషత్తులందు గలవు)

ఈ శ్లోకమున అర్జునుడు భగవానుని మూడు విశేషణముల ద్వారా సంస్తుతించుచు సంబోధించెను. ఇట్టి స్తుతిచే నతడు తన భక్తిభావమును బాగుగ వెల్లడించెను. ఈ ప్రకారముగ వినయాన్వితుడై పరిపూర్ణభక్తి భావసంయుతుడై, ప్రశ్నించుటనే 'పరిప్రశ్న' యందురు. శిష్యుడు గురువు దగ్గఱ ఇవ్విధముగ శ్రద్ధాభక్తులతో మెలగవలెను. అట్టి వర్తనచే గురువు సంతోషించి శిష్యుని శ్రేయము కొఱకై జ్ఞానబోధను వర్షించును.

**శ్రీ భగవానువాచ:-**

**2. కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః**
**సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః**

**వ్యాఖ్య :** గీతయందు సన్న్యాసమనగా సమస్తమును త్యజించి అడవులకుబోవుట అని చెప్పబడలేదు. కామ్యకర్మలను త్యజించుటయే సన్న్యాసమని చెప్పబడినది. అనగా నిట్టిసన్న్యాసమును గృహస్థులుకూడ నాచరించవచ్చునన్నమాట. నిష్కామ కర్మల నాచరించువాడు, కామ్యకర్మలను త్యజించువాడు సన్న్యాసియే అని యర్థము. అట్లే సమస్తకర్మలయొక్క ఫలమును త్యజించువాడు ఆతడేయాశ్రమమున నున్నప్పటికిని 'త్యాగి'యే యగును.

**3. త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః**
**యజ్ఞదాన తపఃకర్మః న త్యాజ్యమితి చాపరే.**

**వ్యాఖ్య :** కర్మ ఉపాధికి (శరీర, ఇంద్రియ, మనంబులకు) సంబంధించినది గావునను ఉపాధి భ్రాంతిజన్యమైనది గనుకను, ఆత్మ సర్వసాక్షికావునను, కర్మ దోషముపగిది త్యజింపదగినదని కొందఱి(సాంఖ్యుల) మతము. కర్మ బొత్తిగా వదలినచో జీవునకు చిత్తశుద్ధి యెట్లు కలుగుననియు, అసలు దేహయాత్రయే యెట్లు జరుగుననియు భావించినవారై కొందఱు చిత్తశుద్ధికరములగు తపో యజ్ఞ దానాది కర్మలు వదలదగినవి కావని చెప్పుదురు. ఈ ప్రకారముగ జనులలో కర్మను గూర్చిన భిన్నాభిప్రాయములను భగవానుడు వ్యక్తపఱచి ఇవ్విషయమున తనయొక్క నిర్ణయమును రాబోవు శ్లోకమున తెలియజేయుచున్నాడు.

**4. నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరత సత్తమ!**
**త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధస్సమ్ప్రకీర్తితః.**

**వ్యాఖ్య :** (1) కర్మలను బొత్తిగా వదలివేయవలెను. (2) తపోయజ్ఞదానాది కర్మలను మాత్రము వదలరాదు- అను రెండు వాదములను జెప్పి భగవానుడు ఆ విషయమున తన తీర్పును చెప్పుచున్నాడు.

'నిశ్చయం శృణు మే'- అని చెప్పినందువలన భగవానుడు తాను పూర్ణముగ స్థిరపఱచుకొని, నిశ్చయించుకొనినదానినే వచించుచున్నారని అర్థము. ఆహా! ఇట్టి భగవన్నిశ్చయమందు జనుల కేల విశ్వాసముండరాదు? సామాన్యులు ప్రకృతికి, మాయకు లోబడినవారు కావున వారి నిశ్చయములం దేవేని లోపములుండవచ్చును. కాని ప్రకృతికి అతీతుడై మాయాదోషములు లేని (చైతన్యరూపుడగు) పరమాత్మయొక్క భావములు అతినిర్దుష్టములై యుండును. అట్టి మహనీయుడు 'నా నిశ్చయము వినుడు' అని చెప్పినపుడు ఇక జీవులు ఎన్ని చెవులతో దానిని వినవలయునో యోచించుకొనుడు! కావున భగవాను డిపుడు చెప్పబోవు త్యాగము మున్నగువానిని గూర్చిన ఉదాత్తభావములను, నిశ్చయములను కడుజాగరూకతతో విని తదనురీతి యనుష్టించి తరించవలెను

**5. యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్.**

**వ్యాఖ్య :** భగవానుడీ శ్లోకమున కర్మలను గూర్చిన తన నిశ్చయమును చెప్పుచున్నాడు-

(1) న త్యాజమ్ - తపోయజ్ఞాది కర్మలను వదలగూడదు.

(2) కార్యమేవ తత్ - వానిని తప్పక చేయవలెను.

'పుణ్యకర్మలను వదలగూడదు' అను వాక్యములోనే ఆ కర్మలను చేయవలెనను అర్థము కూడా ఇమిడి యున్నది. అయినను భగవంతుడు దానితో తృప్తిపడక ఆ పుణ్యకర్మలను తప్పక చేయవలెనని మఱల చెప్పుటచే ఈ విషయము వారెంతగా నొక్కిచెప్పినట్లైనదో విదితము కాగలదు. మఱియు అట్టి పుణ్యకార్యములను చేయుట ముముక్షువుల కెంతటి అవసరమో అదియు స్పష్టమైనది. సామాన్యముగ లోకములో కొందఱు జనులు పుణ్యకార్యములు చేసినచో మఱల జన్మకలుగును. కావున వానిని చేయరాదు అని అమాయకులగువారికి దుర్బోధలు చేయుచు అట్టి కార్యముల నుండి వారిని విరమింపజేయుచున్నారు. ఇది చాలా ఘోరము. ఏలయనిన, అట్లు కావించుట భగవదాశయమునకు విరుద్ధము. భగవానుడు గీతలో పలుచోట్ల పుణ్యకార్యములను, తపోదనాది కర్మలను మిక్కుటముగ ప్రోత్సహించుచు వచ్చెను. ఈ శ్లోకమునందును వానిని తప్పక చేయవలెననియే హెచ్చరించెను. వానిని వదలరాదనియు శాసించెను. ఈ ప్రకారముగ సాక్షాత్ భగవానుడే పలుకుచుండ ఇక మానవమాత్రుల సత్యేతర వాక్యముల నేల విశ్వసించి అధోగతి నొందవలెను? యజ్ఞతపోదానాది పుణ్యకార్యములను నిష్కామముగ నాచరించినచో జనులకు చిత్తశుద్ధి కలుగును. చిత్తశుద్ధివలన ఆత్మజ్ఞానముదయించును. ఆత్మజ్ఞానముచే మోక్షము లభించగలదు. ఈ ప్రకారముగ ఆ యజ్ఞాదికర్మలు మోక్షహేతువులే యగుచున్నవి. కాబట్టి విజ్ఞులు వాటినెన్నడును వదలరాదు.

'పావనాని'- అని చెప్పుటచే ఆ యజ్ఞాది కర్మలు పరమపవిత్రములైనవని స్పష్టమగుచున్నది. అయ్యవి చేయరానివి అయినచో, అపవిత్రములైనచో, దోషజనకములైనచో భగవానుడు వానిని గూర్చి 'పావనాని' అని యిచట చెప్పునే చెప్పరు.

'మనీషిణామ్'- తెలివిగలవారికి- బుద్ధిమంతులకు- అనగా ఫలమునుగోరక చేయువారికి అని యర్థము. ఫలమునుగోరి చేయువారు బుద్ధివికాసము లేనివారు కావున వారు మనీషులు కారు.

ఇచట యజ్ఞమనగా జ్ఞానయజ్ఞమనియు, ఇదివఱలో 4వ అధ్యాయమున తెలుపబడిన స్వాధ్యాయాది చిత్తశుద్ధికరములగు వివిధ యజ్ఞములనియు భావము.

*(తరువాయి వచ్చే సంచికలో)*





# బ్రహ్మాండనాయకుని క్షేత్రంలో తప్పని నారాయణుని తీక్షణ వీక్షణం!





తిరుమల వేంకటనాధుని భక్తుల పట్ల సూర్యనారాయణుడు చూపించే కరుణ పూర్తిగా తగ్గిపోయింది. చెట్టు చేమలను తొలగిస్తూ మాడా వీధుల్లో నివాసాలను పెళ్లగించడమొక కారణమైతే, భక్తులు సేదతీర్చే వేయికాళ్ల మండపాన్ని కూల్చి వేయడం మరో కారణమైంది. తిరుమలకు క్షేత్ర కళలు తప్పి, క్షాత్ర కళలు వచ్చాయి. కొండంతా మహానగరంగా తీర్చిదిద్దారు. సహజసిద్ధంగా ఉండే శుకపిక ధ్వనులతో చల్లని వాయువీచికలతో ఉండే తిరుమల, ఆలయ పరిసరాల్లోనే చల్లదనం లేదు. ఇక్కారణంగా భక్తులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. శీతలంగా ఉండవలసిన శిలాతలం ఉష్ణతలమైపోయింది. వాయుదేవుడు, వరుణదేవులిరువురూ కనులు చాటేస్తున్నారు. వేంకటనాధా! ఏఁవిటయ్యా నీ లీలా సుప్రభాతంలోని అణ్ణన్ వర్ణనమంతా అరణ్యంపాలైంది భక్తుల అరణ్యరోదనను నీవైనా పట్టించుకో! నీవెనుక వెయ్యికాళ్లమండపం నిర్మించడం ప్రయోజనం కాదని చెప్పు.



తిరుమల నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడు ప్రతాపం. తిరుమలకొండ మీదా కనిపిస్తోంది. అన్ని సీజన్లలోనూ చల్లగా ఉండే తిరుమల కొండ మీద వేడి క్రమంగా పెరిగిపోతోంది. గురువారం 33 డిగ్రీలు కనిష్ట గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వడగాలులు వీచాయి. ఉక్కపోత పెరిగింది. ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులు ఎండలోకి వచ్చేందుకు సాహసించలేకపోతున్నారు. ఆలయానికి వెళ్లిన భక్తులు ఎండలో నడిచేందుకు అష్టకష్టాలు చవిచూస్తున్నారు. వేసవిలో భక్తుల ఇబ్బందులకు తగ్గట్టుగానే ఈసారి టీటీడీ ఉపశమన చర్యలు పెంచింది. ఆలయం వద్ద, నాలుగు మాఢవీధుల్లోనూ భక్తుల కాళ్లు కాలకుండా చలువ సున్నం (కూల్ పెయింట్) ఎర్రతివాచీలు పరిచారు. నాలుగు మాడావీధుల్లోనూ ప్రత్యేక పైపు లైను అమర్చి నీటితో చల్లబరుస్తున్నారు. భానుని ప్రతాపం ముందు ఇవన్నీ డీలాపడిపోతున్నాయి. ●



